తెలుగు దినపత్రిక

# డైలీ రిపోర్ట్

DAILY REPORT

సంపుటి: 1 సంచిక: 98 పేజీలు: 4 ఎడిటర్ : బక్క రవీందర్ ప్రచురణ: హైదరాబాద్ బుధవారం 13 -11-2024 వెల: 5/రూ -









# ప్రభుత్వాన్ని అస్థిరపరిచే కుట్ర

లగచర్ల ఘటనలో ఎవరినీ ఉపేక్షించం

రైతుల ముసుగులో అధికారులపై బీఆర్ఎస్ ప్రేరేపిత దాడి

మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వాన్ని అస్థిరపరచాలనే కుట్ర జరుగుతోందని రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆరోపించారు. అధికారం కోల్పోయిన అక్కసుతో అమాయక రైతులను రెచ్చగొట్టి పబ్బం గడుపుకొనేందుకు బీఆర్ఎస్ ప్రయత్నిస్తోందని ఆయన ధ్వజమెత్తారు. చిల్లర, అవకాశవాద, కుట్రపూరిత రాజకీయాలతో మనుగడ సాగించలేరనే విషయాన్ని బీఆర్ఎస్ గుర్తించాలని, పార్టీ ఉనికి కోసం అమాయక రైతులను బలిపెట్టొద్దని గురువారం ఒక ప్రకటనలో ఆ పార్టీ నాయకులకు విజ్ఞప్తి చేశారు. లగచర్ల ఘటనలో ఎవరినీ ఉపేక్షించబోమని, చట్టం తన పని తాను చేసుకుంటూ వెళుతుందన్నారు. జిల్లా కలెక్టర్‌తోపాటు అధికారులపై దాడికి పాల్పడడం హేయమైన చర్య అని విమర్శించారు.

2లో



# శాసన మండలిలో విరుచుకుపడ్డ మంత్రి లోకేశ్

అసెంబ్లీలో నా తల్లిని అవమానించారు..

ఆ తర్వాతే సభను బాబు బహిష్కరించారు

గౌరవ సభగా మారాకే వస్తానన్నారు.. ఆయన పారిపోలేదు.. సింహంలా నిలబడ్డారు

నాడు టీడీపీ ఎమ్మెల్యేలంతా సభకు హాజరయ్యారు.. నేడు వైసీపీ ఎమ్మెల్యేలు రారేం?

మీలాగా మేం ఎన్నడూ మాట్లాడలేదు: లోకేశ్

నాటి ఘటనలను సమర్థించడంలేదన్న విపక్ష నేత బొత్స

టికెట్లు ఇవ్వడం సమర్థించడం కాదా అని లోకేశ్ ప్రశ్న

శాసన మండలిలో విపక్షంపై మంత్రి నారా లోకేశ్ నిప్పులు చెరిగారు. చంద్రబాబు తమ హయాంలో శాసనసభకు రాకుండా పారిపోయారంటూ వైసీపీ సభ్యులు చేసిన వ్యాఖ్యలపై విరుచుకుపడ్డారు.

నాడు అసెంబ్లీలో చంద్రబాబు సింగిల్‌గా, సింహంలా నిలబడ్డారని తెలిపారు. తన తల్లిని అవమానించిన తర్వాతే... ఈ కౌరవ సభలో అడుగు పెట్టేదిలేదని ప్రకటించి

- మిగతా 2వ పేజీలో

# కులగణన.. అధిక నిధులకే..

## రిజర్వేషన్లు పెరగాలన్నా గణన జరగాల్సిందే

విద్య, ఉద్యోగ అవకాశాలకూ ఇదే మార్గం

సీఎం, మంత్రులు తినే సన్నన్నమే గురుకులాల్లో

విద్యార్థులకు నాసిరకం భోజనం పెడితే జైలే

ప్రజాప్రతినిధులు స్కూళ్లను సందర్శించాలి

11 నెలల్లో అత్యంత సంతోషం ఇచ్చిన రోజిది

ప్రభుత్వ విజయోత్సవాలకు ఇదే ప్రారంభం

బాలల దినోత్సవ కార్యక్రమంలో రేవంత్‌రెడ్డి

చెడు వ్యసనాలకు బానిసలం కాబోమంటూ

విద్యార్థులతో ప్రమాణం చేయించిన సీఎం



"సమాజం నుంచి వచ్చిన డిమాండ్ మేరకు కుల గణన చేపట్టాం. జనాభా దామాషా ప్రకారం నిధులు అందాలంటే కుల గణన జరగాలి. విద్య, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెరగాలంటే కుల గణన జరగాలి. రిజర్వేషన్లు పెరగాలంటే కుల గణన జరగాలి. దీనిపై కొంతమంది తప్పుడు ప్రచారం చేస్తున్నారు. మళ్లీ కుట్రలకు తెరలేపుతున్నారు.

హైదరాబాద్: వాటిని తిప్పికొట్టే బాధ్యత విద్యార్థులదే. కుల గణన వల్ల ఏ ప్రభుత్వ పథకాలూ ఆగవు. ఏ ఒక్క పథకాన్నీ తొలగించం. మీకు ఇంకా ఎక్కువ నిధులను కేటాయించడానికే ఈ కుల గణనను చేపడుతున్నాం" అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ కుల గణనను కేంద్ర ప్రభుత్వం చేపట్టే జన గణనలో భాగం అయ్యేలా చూద్దామని, కేంద్రం మెడలు వంచి, కుల గణనను

- మిగతా 2వ పేజీలో



## నటి కస్తూరి ముందస్తు బెయిల్ పిటిషన్ తిరస్కరణ

మధురై: నటి, టీవీ ప్రెజెంటర్ కస్తూరి శంకర్‌కు ముందస్తు బెయిల్ ఇచ్చేందుకు

2లో



## దమ్ముంటే నిరూపించండి

కర్ణాటక సీఎం సిద్ధరామయ్యకు విజయేంద్ర సవాలు

బెంగళూరు: తమ ప్రభుత్వాన్ని కూల్చడానికి బీజేపీ ప్రయత్నించిందని, ఒక్కో కాంగ్రెస్ ఎమ్మెల్యేకు రూ.50 కోట్ల చొప్పున

## వైఎస్ జగన్ ఆదేశం.. వైఎస్సార్‌సీపీ 'ప్రత్యేక టాస్క్‌ఫోర్స్'



తాడేపల్లి: ఏపీలో వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా కార్యకర్తలకు అండగా నిలిచేందుకు పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలతో 'ప్రత్యేక టాస్క్‌ఫోర్స్' ఏర్పాటైంది. కూటమి ప్రభుత్వం ఏర్పాడ్డాక వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా కార్యకర్తలే లక్ష్యంగా అక్రమ అరెస్టులు కొనసాగుతున్నాయి.

2లో

## ఏ కేసులోనైనా అరెస్ట్ కావొచ్చు..

పోరాటాలకు సిద్ధమవ్వండి: కేటీఆర్





## ఇది దేవుడు రాసిన స్క్రిప్ట్!

ఆర్ఆర్ఆర్‌ను నాడు రాష్ట్రానికి రానివ్వలేదు..

నేడు ఆయన ముందు కూర్చోలేని దుస్థితి జగన్‌ది

కల్మషం లేని వ్యక్తి రఘురామకృష్ణరాజు పోరాడి గెలిచాడు..

ఉపసభాపతి అయ్యాడు.. ముక్కుసూటితనమే ఇబ్బందికి గురిచేసింది

## 23న హేమంత్ అండ్ కంపెనీకి వీడ్కోలే




కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా స్పష్టీకరణ

జార్ఖండ్ నుంచి చొరబాటుదార్లను తరిమేస్తామని హామీ

దుమ్కీ: జార్ఖండ్‌లో ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ అండ్ కంపెనీకి ఈ నెల 23న బీజేపీ వీడ్కోలు పలకడం ఖాయమని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా చెప్పారు. జార్ఖండ్‌లో కి అక్రమ చొరబాట్లను హేమంత్ ప్రభుత్వం ప్రోత్సహించిందని ఆరోపించారు. చొరబాటుదార్లు ఇక్కడి గిరిజనుల బిడ్డలను వివాహాలు చేసుకున్నారని, వారి భూములను ఆక్రమించుకున్నారని ఆరోపించారు. బీజేపీ అధికారంలోకి చొరబాటుదార్లను బయటకు తరిమికొడతామని,

2లో

# కులగణన.. అధిక నిధులకే..



(మొదటి పేజీ తరువాయి)

అందులో చేర్చేలా, రాజకీయ, విద్య, ఉద్యోగ రిజర్వేషన్లు పెంచేలా కాంగ్రెస్ పార్టీ కట్టుబడి పని చేస్తుందని తెలిపారు. విద్యార్థులకు దొడ్డు బియ్యం, కుళ్లిన కూరగాయలతో ఆహారాన్ని పెడితే ఊరుకోబోమని, నాసిరకం అన్నం పెట్టేవారు, సరఫరాదారులు కటకటాలపాలేనని హెచ్చరించారు. సన్న బియ్యంతో నాణ్యమైన ఆహారాన్ని అందించాలని ఆదేశించారు. పండిట్ నెహ్రూ జయంతిని పురస్కరించుకుని గురువారం రాష్ట్ర ప్రభుత్వం ఎల్బీ స్టేడియంలో 'బాలల దినోత్సవాన్ని' ఘనంగా నిర్వహించింది. దీనికి ముఖ్య అతిథిగా హాజరైన సీఎం రేవంత్ రెడ్డి ముందుగా నెహ్రూ విగ్రహానికి పుష్పాంజలి ఘటించారు. అంగన్‌వాడీ విద్యార్థుల కోసం 'ప్రియదర్శిని' పేరిట రూపొందించిన పాఠ్య పుస్తకాన్ని, ప్రత్యేక యూనిఫామ్‌ను, తెలంగాణ విద్యా ప్రత్యేక సూచికను ఆవిష్కరించారు. చెడు వ్యసనాలకు బానిసలం కాబోమంటూ విద్యార్థులతో ప్రమాణం చేయించారు. ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. "కలెక్టర్లు వారంలో రెండుసార్లు పాఠశాలలు, గురుకులాలను సందర్శించాలని ఆదేశించాం. అలాగే, నాతో సహా మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు కూడా సందర్శించాలి. విద్యార్థులతో మమేకమై వారి సమస్యలు వినాలి. విద్యార్థులే తెలంగాణ ఆత్మ గౌరవం. ఎలాంటి చెడు వ్యసనాలకు బానిసలు కాకపోతే వారి బంగారు భవిష్యత్తుకు బాట వేసే బాధ్యత ప్రభుత్వానిది" అని స్పష్టం చేశారు. లని సూచించారు. విద్యార్థులు క్రీడల్లో రాణిస్తే, వారు కోరిన ఉద్యోగం ఇచ్చే బాధ్యత తనదని చెప్పారు.

**నాసిరకం అన్నం పెడితే కటకటాలే**

గురుకులాల్లో నాసిరకం అన్నం, కూరగాయలు పెడుతున్నట్లు ఇటీవల వార్తలు వెలువడుతున్నాయని, కలుషిత ఆహారం తిని విద్యార్థులు ఆస్పత్రుల పాలవుతున్నారని సీఎం రేవంత్ ఆందోళన వ్యక్తం చేశారు. నాసిరకం పదార్థాల సరఫరాదారులను, నాసిరకం భోజనం పెట్టేవారిని కటకటాల వెనక్కి తోయాల్సిందేనని, వాళ్లంతా ఊచలు లెక్కపెట్టాల్సిందేని నిర్దేశించారు. "రాష్ట్రంలో పదేళ్లుగా డైట్ చార్జీలు పెంచలేదు. మేం ఇటీవలే డైట్, కాస్మెటిక్ చార్జీలను 40 శాతం పెంచాం. విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పేదవారు. అందుకే డైట్ చార్జీలను ప్రతి నెలా మొదటి వారంలోనే గ్రీన్ చానెల్ ద్వారా విడుదల చేస్తున్నాం. కనక, విద్యార్థులకు నాణ్యమైన భోజనం పెట్టాలి" అని స్పష్టం చేశారు. అవసరమైతే కాంట్రాక్టర్ల బిల్లులను పక్కన పెట్టి, డైట్ చార్జీలను విడుదల చేయాలని అధికారులను ఆదేశించామన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే తాము ఇంతవారమయ్యామని, గురుకులాలను తక్కువ అంచనా వేయవద్దని, గురుకులాలే రాష్ట్ర నాయకత్వాన్ని అందించాయని చెప్పారు. సీఎం, మంత్రులు ఏ సన్న బియ్యం అన్నం తింటున్నారో.. గురుకుల విద్యార్థులకు కూడా దానినే పెట్టాలని చెప్పారు. విద్యార్థులే దేశాన్ని అభివృద్ధి పథం వైపు నడిపించే వారవుతారని, దేశాన్ని నిర్మించే డాక్టర్లు, ఇంజనీర్లు, ఐఏఎస్‌లు అవుతారని, ఆ గొప్ప లక్ష్యం కోసమే ప్రభుత్వం పని చేస్తోందని వివరించారు.

**మూతపడిన పాఠశాలలను తెరిపించాం**

గత పదేళ్లలో ఐదు వేలకుపైగా పాఠశాలలు మూత పడి, దళిత, గిరిజన, ఆదివాసి విద్యార్థులు విద్యకు దూరమయ్యారని, తాము అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని తిరిగి తెరిపించామని సీఎం రేవంత్ చెప్పారు. రాష్ట్రంలో రూ.12 వేల కోట్ల నుంచి రూ.15 వేల కోట్ల వ్యయంతో సమీకృత గురుకుల భవనాలను నిర్మిస్తున్నామని తెలిపారు. విద్యా శాఖకు బడ్జెట్‌లో అత్యధికంగా 7 శాతం నిధులు అంటే.. రూ.21 వేల కోట్లను కేటాయించామన్నారు. పదేళ్లుగా ఉపాధ్యాయ బదిలీలు జరగలేదని, తాము అధికారంలోకి వచ్చిన తర్వాత 21 వేల మంది ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించామని, 35 వేల మందిని చిన్న వివాదం కూడా లేకుండా బదిలీలు చేశామని గుర్తు చేశారు. 11,062 టీచర్ పోస్టులను కూడా భర్తీ చేశామన్నారు. గతంలో విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, డ్రెస్సులు సకాలంలో అందేవి కావని, కానీ.. తాము బడి తెరిచిన మొదటి రోజే అందించామన్నారు. పాఠశాలలకు ఉచిత విద్యుత్తు అందిస్తున్నామని, అటెండర్లను నియమించుకునేలా చేశామని, బ్లాక్ బోర్డులు, ఇతర సౌకర్యాల కోసం మరో రూ.650 కోట్ల నిధులను కేటాయించామని వివరించారు. వర్సిటీల్లో త్వరలోనే బోధన, బోధనేతర సిబ్బందిని నియమిస్తామన్నారు.

## శాసన మండలిలో విరుచుకుపడ్డ మంత్రి లోకేశ్

బహిష్కరించారని గుర్తు చేశారు. ఆ తర్వాత కూడా టీడీపీ సభ్యులు సభకు వచ్చారని తెలిపారు. జగన్‌తోసహా 11 మంది వైసీపీ ఎమ్మెల్యేలున్నారని... వారు ఇప్పుడు అసెంబ్లీకి ఎందుకు రావడంలేదని లోకేశ్ నిలదీశారు. గురువారం శాసన మండలిలో బడ్జెట్‌పై చర్చ సందర్భంగా అధికార, ప్రతిపక్షాల మధ్య తీవ్ర వాగ్యుద్ధం జరిగింది. సభ ప్రారంభమైనప్పటి నుంచే వాతావరణం వేడెక్కింది. ఒకటో తేదీన ఉద్యోగులకు జీతాలు పడలేదని వైసీపీ సభ్యులు పదేపదే ఆరోపించారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను ప్రస్తావిస్తూ వాటి అమలు ఎక్కడ అని ప్రశ్నించారు. దీనికి మంత్రులు గట్టిగా సమాధానమిచ్చారు. ఇప్పటికే అమలు చేస్తున్న పథకాలనూ అమలు చేయడంలేదంటున్నారని మంత్రులు మండిపడ్డారు. "వైసీపీ సభ్యులు అసత్యాలు, అర్ధ సత్యాలు చెబుతున్నారు. వీళ్ల నాయకుడు శాసన సభకు రారు. వీళ్లు మండలిలో అసత్యాలు చెప్పి రెచ్చగొడుతున్నారు. వీళ్ల నాయకుడు సభకు రాకుండా పారిపోయారు. వీళ్లూ పారిపోతారు" అని మంత్రి డోలా బాల వీరాంజనేయ స్వామి విమర్శించారు. దీంతో తమ హయాంలో చంద్రబాబు సభ నుంచి పారిపోయారంటూ వైసీపీ సభ్యులు వ్యాఖ్యానించారు. దీనిపై మంత్రి లోకేశ్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. వైసీపీ హయాంలో చంద్రబాబు ప్రతి రోజూ అసెంబ్లీకి వచ్చారని, తన తల్లిని అవమానించిన తర్వాతే బాయ్‌కాట్ చేశారని చెప్పారు. కౌరవ సభ గౌరవసభ అయిన తర్వాతే వస్తానని ప్రకటించారు. ఆ తర్వాత కూడా తమ ఎమ్మెల్యేలు అసెంబ్లీకి వచ్చారు. అదీ తమ చిత్తశుద్ధి అన్నారు. లోకేశ్ వ్యాఖ్యలపై విపక్ష నేత బొత్స సత్యనారాయణ స్పందిస్తూ... తల్లిని, చెల్లిని, కుటుంబ సభ్యులను అవమానిస్తే ఎవరూ ఒప్పుకోరన్నారు. గతంలో జరిగిన ఘటనలను ఎట్టి పరిస్థితుల్లోనూ సమర్థించడంలేదని తెలిపారు. దీనిపై లోకేశ్ మాట్లాడుతూ... "ఆ రోజు అవమానించినవారికే టికెట్లు ఇచ్చారు. కదా? అది సమర్థించడం కాదా?" అంటూ బొత్సను ప్రశ్నించారు.

## వైఎస్ జగన్ ఆదేశం.. వైఎస్సార్‌సీపీ 'ప్రత్యేక టాస్క్‌ఫోర్స్'

ఒకవైపు అక్రమ అరెస్టులు చేస్తూనే వారిని వేధింపులకు గురిచేస్తున్నారు. దీనిని సమర్థవంతంగా ఎదుర్కోనేందుకు వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక టాస్క్‌ఫోర్స్‌కు నిర్ణయం తీసుకున్నారు. ఇందులో పార్టీ సోషల్ మీడియా కార్యకర్తలకు న్యాయ సహాయం కల్పించడంతో పాటు, భరోసా కల్పించడం, ఆత్మస్థైర్యాన్ని పెంచడానికి తాజాగా ఏర్పాటు చేసిన వైఎస్సార్‌సీపీ ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ పని చేయనుంది.

## ఇది దేవుడు రాసిన స్క్రిప్ట్!

అమరావతి: ఉపసభాపతి రఘురామ కృష్ణరాజు ఉన్నది ఉన్నట్టు మాట్లాడతారని, కల్మషం లేకుండా ముక్కుసూటితనంగా మాట్లాడటం ఆయన నైజమని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. అలా నమ్ముకున్న సిద్ధాంతానికి కట్టుబడి మాట్లాడటమే ఆయనను ఇబ్బందుల్లోకి నెట్టిందన్నారు. దేశ చరిత్రలో ఏ ఎంపీకి ఎదురుకాని దారుణమైన దుస్థితిని ఆయన చూశారని, ఆ పరిస్థితి నుంచి పోరాడి గెలిచి ఇప్పుడు ఉపసభాపతి స్థానానికి వచ్చారని సీఎం కొనియాడారు. అంతకుముందు..ఉపసభాపతిగా రఘురామ కృష్ణరాజు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు సభాపతి అయ్యన్నపాత్రుడు ప్రకటించారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, మంత్రులు అచ్చెన్నాయుడు, సత్యకుమార్ యాదవ్, చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు, ఎమ్మెల్యేలు విష్ణుకుమార్ రాజు, జ్యోతుల నెహ్రూ తదితరులు ఆయనను పోడియం వద్ద సభాస్థానానికి తీసుకెళ్లి కుర్చీలో కూర్చోబెట్టారు. పోడియం పైకి వెళ్లేముందు సీఎం కాళ్లకు ఆర్ఆర్ఆర్ నమస్కారం చేశారు. ఎమ్మెల్యేలంతా సభాస్థానం వద్దకు వచ్చి ఆర్ఆర్ఆర్‌కు అభినందనలు తెలిపారు. ఆ తర్వాత సాయంత్రం వరకూ ఆయనే సభను నడిపించారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ.. ఆర్ఆర్ఆర్ తాతగారు జి.ఎస.రాజు రాష్ట్ర శాసనమండలి తొలి డిప్యూటీ చైర్మన్‌గా పనిచేశారని, అప్పటినుంచే వారికి రాజకీయ వారసత్వం ఉందన్నారు. గత ప్రభుత్వంతో విభేదించిన కారణంగా సొంత ఎంపీ అని కూడా చూడకుండా జగన్ ప్రభుత్వం అత్యంత దారుణంగా ఆర్ఆర్ఆర్‌ను హింసించిందన్నారు. "సొంత ఎంపీపైనే నాటి వైసీపీ ప్రభుత్వం రాజద్రోహం కేసుపెట్టారు. 2021 మే 14న ఆర్ఆర్ఆర్ పుట్టినరోజు నాడే హైదరాబాద్ వెళ్లి బలవంతంగా అరెస్టు చేసి ఏపీకి తీసుకొచ్చారు. శని, ఆదివారాల్లో కోర్టులకు సెలవు అని కావాలనే శుక్రవారం అరెస్టు చేశారు. అరెస్టు చేసిన రోజు రాత్రి గుంటూరు సీఐడీ ఆఫీసులో ఐదుగురు ముసుగు వేసుకుని వచ్చి అత్యంత దారుణంగా కొట్టారు. లాఠీలు, రబ్బరు బెల్టులతో కాళ్లపై కొట్టారు. కోర్టులో కొట్టిన విషయం చెబితే సాయంత్రం కస్టడీకి వచ్చినప్పుడు చంపేస్తామని బెదిరించారు. అయినా భయపడకుండా కోర్టులో కాళ్లకు ఉన్న దెబ్బలను ఆర్ఆర్ఆర్ చూపించారు. కోర్టు ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లమని ఆదేశిస్తే, కావాలని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడకూడా రిపోర్టులు తారుమారుచేశారు. మధ్యాహ్నం ఇవ్వాల్సిన రిపోర్టు సాయంత్రం 6గంటలకు కోర్టుకు సమర్పించారు. ఈలోగా మేం సుప్రీంకోర్టుకు వెళ్లాం. సుప్రీంకోర్టు ఆదేశాలతో హైదరాబాద్‌లో మిలటరీ ఆసుపత్రిలో ఆర్ఆర్ఆర్ చేరారు. అక్కడ కూడా రిపోర్టులు మార్చాలని ఓ వ్యక్తి ప్రయత్నించాడు. సభ్యత కాదు కాబట్టి ఆయన పేరు ఇక్కడ చెప్పట్లేదు. అయినా అక్కడితో కక్ష ఆపకుండా ఆయనను వేధించే ప్రయత్నం చేశారు. అప్పట్లో నర్సాపురం ఎంపీగా ఉన్న ఆయనను సొంత నియోజకవర్గంలో అల్లూరి సీతారామరాజు విగ్రహావిష్కరణకు రానివ్వలేదు.

## 23న హేమంత్ అండ్ కంపెనీకి వీడ్కోలే

భూములను వెనక్కి తీసుకొని గిరిజనులకు అందజేస్తామని ప్రకటించారు. ఇందుకోసం ఒక చట్టం తీసుకొస్తామని హామీ ఇచ్చారు. గురువారం జార?ండ్‌లోని దుమ్రీలో ఎన్నికల ప్రచారంలో అమిత్ షా పాల్గొన్నారు. హేమంత్ సోరెన్ ప్రభుత్వం అవినీతిలో కూరుకుపోయిందని, ప్రజల సంక్షేమం కోసం ఖర్చు చేయాల్సిన నిధులను దోచుకుందని మండిపడ్డారు. జనం సొమ్మును కొట్టగొట్టిన హేమంత్ అండ్ కంపెనీకి వీడ్కోలు తప్పదని స్పష్టంచేశారు. జార?ండ్ రాష్ట్ర ఏర్పాటును వ్యతిరేకించిన కాంగ్రెస్, ఆర్జేడీ కూటమితో హేమంత్ సోరెన్ జట్టుకట్టారని విమర్శించారు. పరిశ్రమలు, ఉద్యోగాలు, ఉపాధి అవకాశాలు కావాలంటే అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీని గెలిపించాలని అమిత్ షా కోరారు. జమ్మూకశ్మీర్‌లో ఇండియాలో అంతర్భాగమని, ఆర్టికల్ 370ని మళ్లీ తీసుకొచ్చేసత్తా ఎవరికీ లేదని తేల్చిచెప్పారు. ఓబీసీ రిజర్వేషన్లను ముస్లింలకు అప్పగించడానికి ఎట్టిపరిస్థితుల్లోనూ అనుమతించబోమని, రాహుల్ బాబా నా లుగో తరం కూడా ఆ పని చేయలేదని అన్నారు.

**చట్టంలో సవరణ తీసుకొస్తాం**

రాహుల్ గాంధీని రాజకీయాల్లో ప్రవేశపెట్టేందుకు ఆయన మాతృమూర్తి సోనియా గాంధీ ఇప్పటిదాకా 20 సార్లు ప్రయత్నించారని అమిత్ షా చెప్పారు. ఆ ప్రయత్నాలన్నీ విఫలమయ్యాయని, రాహుల్ గాంధీ విమానం ల్యాండ్ కాలేదని అన్నారు. 21వ ప్రయత్నంలో జార?ండ్‌లో రాహుల్ గాంధీ విమానం కుప్పకూలడం తథ్యమని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ పాలనలోని కర్ణాటకలో వక్ఫ్ బోర్డు హిందూ ప్రాచీన దేవాలయాల భూములను ఆక్రమించిందని ఆరోపించారు. వ్యవసాయ భూములను కూడా కబ్జా చేసిందని పేర్కొన్నారు. ఇలాంటి కబ్జాలను అడ్డుకోవడానికి చట్టంలో సవరణ చేస్తామని చెప్పారు. ఇదిలా ఉండగా, జార?ండ్‌లో అసెంబ్లీ ఎన్నికల ఓట్ల లెక్కింపు ఈ నెల 23న జరుగనుంది.

## ఏ కేసులోనైనా అరెస్ట్ కావొచ్చు..

(మొదటి పేజీ తరువాయి)



తెలంగాణభవన్: తనను ఏదో ఒక కేసులో అరెస్ట్ చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రయత్నిస్తోందన్నారు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్. ఈ నేపథ్యంలో పోరాటం చేసేందుకు సిద్ధంగా ఉండాలని బీఆర్ఎస్ పార్టీ శ్రేణులకు కేటీఆర్ సూచించారు.మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే కేటీఆర్ తెలంగాణభవన్‌లో నేడు పార్టీ ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో భేటీ అయ్యారు. లగచర్ల ఘటనకు సంబంధించిన రిమాండ్ రిపోర్టులో కేటీఆర్ పేరు ఉండటంతో దీనిపై పార్టీ నేతలు చర్చించారు. ఒకవేళ కేటీఆర్‌ను అరెస్ట్ చేస్తే భవిష్యత్ కార్యచరణపై చర్చించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం బీఆర్ఎస్ నేతలను టార్గెట్ చేసింది. నన్ను అరెస్ట్ చేసేందుకు పలు డ్రామాలకు తెరలేపుతున్నారు. ఏదో ఒక కేసులో నన్ను అరెస్ట్ చేసేందుకు రేవంత్ ప్రభుత్వం ప్రయత్నం చేస్తోంది. పోరాటం చేసేందుకు బీఆర్ఎస్ శ్రేణులు సిద్ధంగా ఉండాలి. పోరాటాలు మనకేమీ కొత్త కాదు అని నేతలకు సూచించారు.మరోవైపు.. లగచర్ల కేసులో అరెస్టయిన కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డిని హరీశ్‌రావు పరామర్శించారు. ఈ సందర్భంగా హరీష్ మీడియాతో మాట్లాడుతూ.. కుట్రపూరితంగా నరేందర్‌రెడ్డిని అరెస్ట్ చేయించారు. కొడంగల్ నుంచే ప్రజాపాలన మీద తిరుగుబాటు మొదలైంది. ఈ అరెస్ట్ ప్రభుత్వ దిగజారుడుతనానికి ఇదే నిదర్శనం. మీకు ఓటేస్తే మేలు జరుగుతుందనుకుంటే పాపానికి.. లగచర్ల గ్రామం భూములను గుంజుకోవడమే నువ్వు చేసే మేలా?. కాంగ్రెస్ నాయకులు అబద్దాలు వల్లే వేస్తున్నారు. ఎక్కడ ఏం జరిగినా బీఆర్ఎస్‌పై పెడుతున్నారన్నారు. రేవంత్ సొంత నియోజకవర్గంలో తమ భూముల కోసం గిరిజనులు పోరాటం చేస్తే అది కూడా బీఆర్ఎస్ చేసిందనే అంటున్నారన్నారు. ప్రజలకు అన్యాయం జరిగితే పోరాడడం ప్రతిపక్షాలుగా మా బాధ్యత అన్నారు.

## ప్రభుత్వాన్ని అస్థిరపరిచే కుట్ర

కలెక్టర్‌పైనే హత్యకు భారీగా కుట్ర పన్నారని, రైతుల ముసుగులో కొంతమంది గులాబీ గూండాలు శాంతి భద్రతలకు విఘాతం కలిగించే ప్రయత్నం చేస్తున్నారని, దీనివెనుక ఎవరున్నారో కూడా అందరికీ తెలుసని వ్యాఖ్యానించారు. రైతులు తమ సమస్యలు చెప్పుకోవడానికి, స్థానికుల సమస్యలను వినడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉన్నా, కుట్రపూరిత చర్యలకు పాల్పడడం దురదృష్టకరమన్నారు. రైతులకు నష్టం కలిగించే ఉద్దేశం ప్రభుత్వానికి లేదని, ప్రజాస్వామ్యయుతంగా ప్రభుత్వం అందరి అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకొనే ముందుకు వెళుతుందని పేర్కొన్నారు. అధికారులపై దాడి జరిగినట్టుగానే భవిష్యత్‌లో రాజకీయ నాయకులకో, ప్రజలకో జరిగితే ప్రభుత్వం ఉపేక్షించబోదని స్పష్టం చేశారు.ప్రజలను కాపాడుకున్నట్టే, అధికారులను కాపాడుకోలేకపోతే పనిచేయడానికి ఎవరు ముందుకు వస్తారని ప్రశ్నించారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో సమస్య చెప్పుకోవడానికి వచ్చిన ఖమ్మం మిర్చి రైతులకు బేడీలు వేశారని గుర్తు చేశారు. ఇసుక దందాలకు అడ్డువస్తున్నారని, సిరిసిల్ల నియోజకవర్గ పరిధిలోని నేరెళ్లలో దళితులను ట్రాక్టర్‌తో తొక్కించి పోలీస్‌స్టేషన్‌లో థర్డ్ డిగ్రీ ప్రయోగించి హింసించారని గుర్తు చేశారు. ఆనాటి ప్రభుత్వం పెట్టిన హింసను భరించలేక 2021 జూన్ నెలలో వేములఘాట్ రైతు తూటుకూరి మల్లారెడ్డి, కూల్చివేసిన తన ఇంటిలోని కట్టెలను పోగుచేసి, దానినే చితిగా మార్చుకొని ఆత్మార్పణ చేసుకున్నాడని పేర్కొన్నారు. ఆనాటి ప్రభుత్వం పెట్టిన బాధలను భరించలేక ఏకంగా రైతులు ఆత్మహత్యలు చేసుకుంటే కుటుంబాలు వీధిన పడ్డాయన్నారు. గడచిన 11 నెలలుగా ప్రతి విషయంలోనూ ప్రజాస్వామ్యయుతంగా ప్రజల సమస్యలను పరిష్కరిస్తున్నట్టు చెప్పారు.

## దమ్ముంటే నిరూపించండి

ఇవ్వజూపిందని, 50 మంది ఎమ్మెల్యేలను కొనడానికి కుట్రలు చేసిందని కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ఆరోపించడం సంచలనాత్మకంగా మారింది. సిద్ధరామయ్య ఆరోపణలపై కర్ణాటక బీజేపీ అధ్యక్షుడు బి.వై.విజయేంద్ర తీవ్రంగా స్పందించారు. దమ్ముంటే నిరూపించాలని గురువారం సిద్ధరామయ్యకు సవాలు విసిరారు. ముఖ్యమంత్రి సొంత పార్టీ ఎమ్మెల్యేల విశ్వాసం కోల్పోయారని, అందుకే తమపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. ఒక్కో ఎమ్మెల్యేకు రూ.50 కోట్ల చొప్పున ఇవ్వడానికి తాము ప్రయత్నించినట్లు నిరూపించకపోతే ప్రజలు ఎప్పటికీ ఆయనను నమ్మరని తేల్చిచెప్పారు. ఉన్నత పదవిలో ఉన్న నాయకుడి ప్రవర్తన కూడా ఉన్నతంగా ఉండాలని హితవు పలికారు. దర్యాప్తు సంస్థలు ముఖ్యమంత్రి చేతిలోనే ఉన్నాయని, ఆరోపణలను ఎందుకు నిరూపించడం లేదని ప్రశ్నించారు. అయితే, విజయేంద్ర సవాలుపై స్పందించడానికి సిద్ధరామయ్య నిరాకరించారు. మరోవైపు బీజేపీపై ముఖ్యమంత్రి సిద్ధరామయ్య చేసిన ఆరోపణలను ఉప ముఖ్యమంత్రి, కర్ణాటక పీసీసీ అధ్యక్షుడు డి.కె.శివకుమార్ సమర్థించారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేలను కొనుగోలు చేయడానికి బీజేపీ ప్రయత్నించిన సంగతి నిజమేనని గురువారం చెప్పారు.

## నటి కస్తూరి ముందస్తు బెయిల్ పిటిషన్ తిరస్కరణ

మద్రాస్ హైకోర్టు మధురై ధర్మాసనం గురువారం తిరస్కరించింది. తమిళనాడులోని తెలుగు మాట్లాడేవారిపై ఆమె అభ్యంతరకర వ్యాఖ్యలు చేసినట్లు దాఖలైన కేసులో అరెస్ట్ కాకుండా రక్షణ కల్పించాలని ఆమె కోరారు. జస్టిస్ ఆనంద్ వేంకటేశ్ మాట్లాడుతూ.. కస్తూరి ఇటువంటి వివాదాస్పద వ్యాఖ్యలు చేయడం సమర్థనీయం కాదన్నారు. మద్రాస్ ప్రెసిడెన్సీ కాలం నుంచి తెలుగువారు తమిళనాడులో ఉంటున్నారని, ఈ దేశంలో వారు కూడా భాగమేనని చెప్పారు.



# వికసిత భారత్ 2047 వైపుగా దేశాన్ని తీర్చిదిద్దడంలో ఐఐటీ హైదరాబాద్ ఒక ప్రముఖ సంస్థగా మారుతుంది: సుకాంత మజుందార్





**సంగారెడ్డి అర్బన్ నవంబర్ 14:** విద్యా , ఈశాన్య ప్రాంత అభివృద్ధి శాఖ సహాయ మంత్రి డాక్టర్ సుకాంత మజుందార్ ఐఐటీ హైదరాబాద్‌ను సమీక్షా సమావేశం కోసం సందర్శించారు ."వికసిత భారత్ 2047 వైపుగా దేశాన్ని తీర్చిదిద్దడంలో ఐఐటీ హైదరాబాద్ ఒక ప్రముఖ సంస్థగా మారుతుందన్నారు.విద్యా మరియు ఈశాన్య ప్రాంత అభివృద్ధి శాఖ సహాయ మంత్రి డాక్టర్ సుకాంత మజుందార్ క్యాంపస్‌లో సమీక్షా సమావేశం నిమిత్తం హాజరై, "వికసిత భారత్ 2047 వైపుగా దేశాన్ని తీర్చిదిద్దడంలో ఐఐటీ హైదరాబాద్ ఒక ప్రముఖ సంస్థగా మారుతుంది" అని చెప్పారు. "ఎక్ పెడ్ మా కే నామ్" కార్యక్రమంలో భాగంగా, డాక్టర్ మజుందార్ పచ్చదనం విస్తృతికి మొక్కల వితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. గౌరవనీయ మంత్రి కల్పనా చావ్లా హాస్టల్ బ్లాక్‌ను ప్రారంభించారు.హైదరాబాద్, 14 నవంబర్ 2024: భారత ప్రభుత్వ విద్యా మరియు ఈశాన్య ప్రాంత అభివృద్ధి శాఖ సహాయ మంత్రి డాక్టర్ సుకాంత మజుందార్ గారు ఐఐటీ హైదరాబాద్ క్యాంపస్‌లో సమీక్షా సమావేశానికి హాజరయ్యారు. మెదక్ ఎంపీ మదవనేని రఘునందన్ రావు అతిథిగా విచ్చేశారు. మంత్రిగారి పర్యటనలో ఐఐటీ హైదరాబాద్‌లో జరుగుతున్న అభివృద్ధి, ప్రారంభోత్సవాలు, మరియు విద్యా మరియు ప్రణాళికా రంగాలపై చర్చలు జరిగాయి, మరియు ఈ సంస్థ విద్యా, స్థిరత్వ అభివృద్ధి పట్ల అంకితభావాన్ని చాటిచెప్పాయి.ఆయన వివిధ విభాగాలను సందర్శించి, అధ్యాపకులు మరియు విద్యార్థులతో చర్చించి వివిధ రంగాలలోని విద్యా మరియు పరిశోధన కార్యక్రమాలపై అవగాహన పొందారు. ఆధునిక సాంకేతిక వనరుల కేంద్రంగా ఉన్న నాలెడ్జ్ రిసోర్స్ సెంటర్ (లైబ్రరీ)ను కూడా సందర్శించి పరిశోధన మరియు విద్యా రంగాలకు అందించే సహకారాన్ని వివరించారు. ఆ తర్వాత రీసెర్చ్ సెంటర్ కాంప్లెక్స్‌లోని (సోఫిస్టికేటెడ్ అనలిటికల్ అండ్ టెక్నికల్ హెల్ప్ ఇనిస్టిట్యూట్) సెంటర్‌ను పరిశీలించారు. ఈ పర్యటన (టెక్నాలజీ ఇన్నోవేషన్ హబ్ ఆన్ ఆటోనమస్ నావిగేషన్) కేంద్రానికి కొనసాగింది, ఇది భూమి మరియు వైమానిక వాహన పరీక్షలకు భారత్‌లోని మొదటి ఆటోనమస్ నావిగేషన్ కేంద్రంగా ఉంది. ఇక్కడ జరుగుతున్న పరిశోధన, ఆటోనమస్ వాహనాలు, కొత్త ద్రోను భావన ను పరిశీలించి అభివృద్ధిలో ఉన్న ఆధునిక సాంకేతికతలను గురించి తెలుసుకున్నారు.పర్యటనలో భాగంగా, డాక్టర్ మజుందార్ కల్పనా చావ్లా హాస్టల్ బ్లాక్‌ను ప్రారంభించారు, ఇది విద్యార్థుల జీవన అనుభవాన్ని మెరుగుపరిచేందుకు నిర్మించిన కొత్త వసతి సౌకర్యం.డాక్టర్ మజుందార్, "ఎక్ పెడ్ మా కే నామ్" కార్యక్రమంలో మొక్కల వితరణలో పాల్గొన్నారు, ఇది పర్యావరణ స్మృతిని ప్రోత్సహించే కార్యక్రమంగా ఉన్నది. ఐఐటీ హైదరాబాద్ డైరెక్టర్ ప్రొఫెసర్ బి. ఎస్. మూర్తి గారు స్వాగత ఉపన్యాసంలో డాక్టర్ సుకాంత మజుందార్ యొక్క విజయాలు మరియు వికసిత భారత్ లక్ష్యాలపై భారత ప్రభుత్వ కృషిని ప్రస్తావించారు.మెదక్ ఎంపీ రఘునందన్ రావు గారు ఐఐటీ హైదరాబాద్ యొక్క ప్రగతిని ప్రశంసిస్తూ, "ఐఐటీ హైదరాబాద్ వసతులతో పాటుగా మేధోశక్తి, ఆరోగ్యాన్ని అందించగలదు. ప్రధాని నరేంద్ర మోడీ దృష్టిలో, ఐఐటీ హైదరాబాద్ వికసిత భారత్ 2047కి కీలకంగా ఉంటుంది," అని అన్నారు. గౌరవ మంత్రి డాక్టర్ సుకాంత మజుందార్ ఐఐటీ హైదరాబాద్ యొక్క కృషిని మరియు భారత విద్యా మరియు పరిశోధన రంగాల్లో చేసిన కృషిని ప్రశంసిస్తూ, "ఐఐటీ హైదరాబాద్ యొక్క ప్రయాణం, విద్యా మరియు పరిశోధనలో అంకితభావంతో ముందుకు సాగుతూ, దేశంలో ప్రఖ్యాత విద్యా సంస్థగా నిలిచింది. సమగ్ర విద్యా మరియు పరిశోధన దృష్టితో, ఇది భారతదేశంలో వినూత్నతకు రారాజుగా నిలుస్తోంది. ఈ రోజు మొక్కలు నాటుతూ, మనం తల్లి యొక్క ప్రేమను స్మరించుకుంటూ, మనం అభివృద్ధి మరియు సాంకేతికత పట్ల మన అంకితభావాన్ని గుర్తుచేసుకుంటున్నాము," అని అభిప్రాయపడ్డారు.



## 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు ప్రారంభం

**సంగారెడ్డి అర్బన్ నవంబర్ 14:** జిల్లా గ్రంథాలయ సంస్థ సంగారెడ్డి అధ్వర్యంలో జిల్లా కేంద్ర గ్రంథాలయం యందు 57 వ జాతీయ గ్రంథాలయ వారోత్సవములు ప్రారంభమయ్యాయి, ఈ కార్యక్రమంను గ్రంథాలయ సంస్థ అధ్యక్షులు జి.అంజయ్య , గ్రంథాలయ సంస్థ కార్యదర్శి వసుంధర, విశిష్ట అతిథి మాణయ్య , రిటైర్డ్ సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్ లతో పాటు పాఠశాల విద్యార్థులతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేశారు .అనంతరం జవహర్ లాల్ నేహ్రు, రంగనాథన్, సరస్వతి చిత్రాలకు పూలమాలలు వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం పాఠశాల విద్యార్థులు ఒక్కొక్కరుగా ప్రసంగించారు, అనంతరం సంస్థ అధ్యక్షులు మాట్లాడుతూ యావత్ భారతదేశంలో బాలల దినోత్సవంను ఘనంగా జరుపుకొంటున్నారు. నాడు చదువుకొనుటకు పరిమిత స్థాయిలో పత్రికలు, పుస్తకాలు అందుబాటులో ఉండేవి, నేడు భారతదేశం అన్ని రంగాల్లో ముందుకు పోతున్న వేళ విద్యను అంది పుచ్చుకోవాలని, భావితరాలను మంచి ఉన్నతంగా నిర్మించుకోవాలని తెలిపారు, నారాయణఖేడ్ గ్రంథాలయం మరియు జిల్లా కేంద్ర గ్రంథాలయంలో చదువుకుని ఏంతో మంది విద్యార్థులు ఉద్యోగాలు సాధించారని ప్రశంసించారు.





## బావితరానికి బాలలు ఆదర్శంగా నిలవాలి

**విద్యార్థులకు ప్రెస్ క్లబ్ తరపున పండ్లు పంపిణీ-ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు గరిడేపల్లి మురళి.**

**అనంతగిరి,నవంబర్14,(డైలీ రిపోర్ట్):** భావితరానికి బాలలు ఆదర్శంగా నిలవాలని ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు గరిడేపల్లి మురళి అన్నారు.గురువారం జాతీయ బాలల దినోత్సవ సందర్భంగా అనంతగిరి మండల కేంద్రంలో మానసిక వికలాంగులు విద్యార్థులతోపాటు అంగన్వాడి పిల్లలకు బ్రెడ్ ప్యాకెట్ తో పాటు పండ్లను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జవహర్లాల్ నెహ్రూ జన్మదినాన్ని నేడు బాలల దినోత్సవం జరుపుకోవడం సంతోషంగా ఉంది అన్నారు. ఇవాల్టి బాలలే రేపటి పౌరులు అన్న నానుడి వారి భవిష్యత్తుకు ఆదర్శంగా నిలవాలని కోరారు.ప్రెస్ క్లబ్ తరఫున నిత్యం వారి సమస్యలను బహిర్గతం చేయడానికి ఎప్పుడూ ముందుంటామని వారి సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లే విధంగా వార్తలు ప్రచురించడానికి సహకరిస్తామని అన్నారు.ఈ కార్యక్రమంలో క్లబ్ ప్రధాన కార్యదర్శి భానోతు సతీష్,గౌరవ అధ్యక్షులు,సలహాదారులు కరుణాకర్, ఈదయ్య, తునం వెంకటేశ్వరరావు,సభ్యులు రాము, హర్ష బాలు,ఉపేందర్,మణికంఠ,గోపి,శ్రీరామ్, ఉపాధ్యాయులు,తదితరులు పాల్గొన్నారు.



## కలెక్టరేట్‌లో రెవెన్యూ ఉద్యోగుల నిరసన

**జిల్లా కలెక్టర్ కు వినతిపత్రం అందచేశారు**

**సంగారెడ్డి అర్బన్ , నవంబర్ 14 :** వికారాబాద్ జిల్లా దుద్యాల మండలం లగచర్లలో కలెక్టర్ సహా తహశీల్దార్ ఇతర అధికారులపై దాడిని ఖండిస్తూ, ట్రేసా రాష్ట్ర అధ్యక్షులు వంగా రవీందర్ రెడ్డి మరియు రాష్ట్ర కార్యదర్శి గౌతమ్ కుమార్ ఆదేశాల మేరకు సంగారెడ్డి జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయం(కలెక్టరేట్)లో రెవెన్యూ ఉద్యోగులు మంగళవారం నాడు నల్లబ్యాడ్జీలను ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రెవెన్యూ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు. రాములు కార్యదర్శి కిరణ్ కుమార్ మాట్లాడుతూ, వికారాబాద్ జిల్లా కలెక్టర్, తహశీల్దార్, ఇతర ఉద్యోగులపై దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. బాధ్యులపై వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విధి నిర్వహణలో భాగంగా గ్రామానికి వెళ్లిన అధికారులపై క్రిమినల్స్ తరహాలో మూకుమ్మడిగా దాడి చేయడం శోచనీయమని ఆక్షేపించారు. ఈ దాడికి పాల్పడిన వాళ్లందర్నీ వెంటనే అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకునేంత వరకు రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు జిల్లాలోని రెవెన్యూ ఉద్యోగులందరు నల్ల బ్యాడ్జీలు ధరించి విధులకు హాజరవడం ద్వారా తమ నిరసనను కొనసాగించాలని నిర్ణయించడం జరిగిందన్నారు. ఇటీవల కాలంలో రెవెన్యూ ఉద్యోగుల పైన దాడులు నిత్యకృత్యంగా మారాయని ఆందోళన వెలిబుచ్చారు. దాడులను అరికడుతూ రెవెన్యూ ఉద్యోగులకు రక్షణ కల్పించేందుకు ప్రభుత్వం కఠిన చట్టాలు అమలు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. జిల్లా కలెక్టర్ కి కలిసి వినతిపత్రం అందచేశారు నిరసన కార్యక్రమంలో ఏవో పరమేశ్వర్. జిల్లా లోని తహసీల్దార్ లు రెవెన్యూ ఉద్యోగుల సంఘం జిల్లా అసోసియేట్ అధ్యక్షులు రాములు.ఆయా విభాగాల పర్యవేక్షకులు కలెక్టర్ కార్యాలయ సిబ్బంది, ఆయా మండల , డివిజన్ కార్యాలయ రెవెన్యూ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.తదుపరి జిల్లా కలెక్టర్ మరియు అదనపు కలెక్టర్ బాధ్యులపై తగు చర్యలు తీసుకోవలసిందిగా వినతి పత్రం సమర్పించారు.

## మల్కాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఘనంగా బాలల దినోత్సవం



**సంగారెడ్డి అర్బన్ నవంబర్ 14:** జిల్లా బాలల పరిరక్షణ విభాగం , మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మల్కాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లో ఘనంగా బాలల దినోత్సవం నిర్వహి%శీ% చారు.ఈ కార్యక్రమానికి జిల్లా న్యాయ సేవాదికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి శ్రీ రమేష్ పాల్గొని బాలలను ఉద్దేశించి మాట్లాడారు.ఈ కార్యక్రమంలో లో బాలల దినోత్సవం పురస్కరించుకొని పిల్లలకు వ్యాస రచన, చిత్ర లేఖనం, వకృత్వ పోటీలు నిర్వహించారు.ఈ పోటీలలో ఉత్తమ ప్రతిభ చూపిన పిల్లలకు జడ్జి బహుమతులు అందజేశారు.కార్యక్రమంలో స్థానిక అంగన్వాడీ చిన్నారులు వివిధ రకాల రాష్ట్రాల ప్రజల వేషధారణ తో ఆకట్టుకోవడం జరిగింది. జడ్జి చిన్నారులను అభినందించి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి లలిత కుమారి పాల్గొని పిల్లను ఉద్దేశించి ప్రసంగించారు ఈ బాలల దినోత్సవం సందర్బంగా ఆపద లో ఉన్న లేదా ఇబ్బందులలో ఉన్న పిల్లలకు మనం సహాయం చేయాలి అన్నారు.. ఏదైనా ఆపదలో ఉన్న పిల్లల సమాచారం మీకు తెలిసిన 1098 చైల్డ్ హెల్ప్ లైన్ లేదా 181 కి సమాచారం ఇవ్వాలని కోరారు..ఈ కార్యక్రమంలో జిల్లా బాలల పరిరక్షణ అధికారి రత్నం, స్థానిక సిడిపిఓ చంద్రకళ, పాఠశాల ప్రధానోపధ్యాయులు యాదగిరి, ఉపాధ్యాయులు మరియు మహిళా శిశు సంక్షేమ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

## లిటిల్ స్టార్ పాఠశాలలో ఘనంగా బాలల దినోత్సవం

శంకర్ పల్లి నవంబర్ 14 (డైలీ రిపోర్ట్): శంకర్పల్లి పట్టణ లిటిల్ స్టార్ పాఠశాలలో గురువారం బాలల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు మార్కెట్లో గల నెహ్రూ విగ్రహానికి కరస్పాండెంట్ సంజిత్ కుమార్ పూలమాలలు వేశారు. ముద్దులొల్లికే చిన్నారులు వివిధ వేషధారణలో వచ్చి ఆట పాటలతో అలరించారు. చిన్నారులు ఆనందంగా ఆరోగ్యంగా ఉండటం ఎంతో అవశ్యకమన్నారు. వారే రేపటి నవతరంగా ఎదిగి దేశాన్ని ముందుకు తీసుకెళ్తారని గుర్తు చేశారు ప్రతి చిన్నారి కల సాకారం కావాలని ఆకాంక్షించారు.









# మానవ సేవ – ఆయన తోవ

## సేవలతో మానవత్వ పరిమళాలు ..

## ఆకలితో ఉన్న వారికి ఆపన్న హస్తం ..

## సమాజ సేవలకు గుర్తింపుగా అంతర్జాతీయ స్థాయి అవార్డ్..

## ఆధ్యాత్మిక , ధార్మిక కార్యక్రమాలకు పెద్ద పీట..

## ఇతోధిక సేవలతో గుర్తింపు పొందిన డాక్టర్ మాంకాల నవీన్ కుమార్ ..

సిద్దిపేట , ( డైలీ రిపోర్ట్ ) , నవంబర్ 14


**అయన వృత్తి వ్యాపారం.. ప్రవృత్తి మాత్రం సమాజ సేవ. వ్యాపారంలో వచ్చే ఆదాయంలో కొంత భాగాన్ని సేవా కార్యక్రమాలకు వినియోగిస్తూ మానవత్వాన్ని చాటుకుంటున్నారు. ఆకలితో ఉన్న వారి కడుపులు నింపుతూ .. సేవా కార్యక్రమాలతో మానవత్వపు పరిమళాలు పంచుతున్నారు. ఆయనే ప్రముఖ సేవా తత్పరుడు , నంది అవార్డు గ్రహీత డాక్టర్ మాంకాల నవీన్ కుమార్. మానవ సేవే మాధవ సేవ అన్న సూక్తిని అక్షరాలా నిజం చేస్తున్న మాంకాల నవీన్ కుమార్ సిద్దిపేటలో పెద్దగా పరిచయం అక్కర లేని వ్యక్తి. సేవా కార్యక్రమాల ద్వారానే మనిషికి శాశ్వత గుర్తింపు లభిస్తుందని ఆయన బలంగా నమ్ముతారు. అందుకే సిద్దిపేటలో ఎక్కడ సేవా కార్యక్రమాలు జరిగినా ఆయన అక్కడ వాలిపోతారు. వాసవి క్లబ్ ద్వారా సామాజిక కార్యక్రమాలకు అంకురార్పణ చేసిన నవీన్ కుమార్ ఆనేక సేవా సంస్థల్లో వివిధ హెూదాల్లో సేవలందిస్తున్నారు. ఆధ్యాత్మిక , ధార్మిక కార్యక్రమాల్లో కూడా ఆయన ఎప్పుడూ ముందుంటారు.**




మాంకాల వారి ప్రాంతీయ సదస్సులో


శ్రీ భూ నీళా పమేత లక్ష్మివెంకటేశ్వర స్వామి వార్ల కళ్యాణంలో

### వాసవి క్లబ్ తో ప్రేరణ ..


అమర్ నాథ్‌కు వెళుతున్న వాహనంలో నిత్యావసరాలను నింపుతూ

ఆధ్యాత్మిక , ధార్మిక , సేవా కార్యక్రమాలకు పుట్టినిల్లు సిద్ధిపేట. ఎప్పుడూ ఏదో ఒక చోట ఇలాంటి కార్యక్రమాలు జరుగుతూనే ఉంటాయి. ఆర్యవైశ్యుల సేవా కార్యక్రమాలకు వేదికైన వాసవి క్లబ్ చేపడుతున్న సర్వీస్ యాక్టివిటీస్ తో ప్రేరణ పొందిన నవీన్ కుమార్ 2014లో వాసవి క్లబ్ లో సభ్యత్వం తీసుకున్నారు. క్లబ్ ద్వారా నిర్వహించే సామాజిక కార్యక్రమాల్లో పాల్గొంటూ తన వంతుగా సహకారం అందించేవారు. ఈ క్రమంలోనే నవీన్ కుమార్ ఉత్సాహాన్ని , సేవా నిరతిని గుర్తించిన వాసవి క్లబ్ పెద్దలు 2015లో సిద్ధిపేట పట్టణ ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు అప్పగించారు. ఆ తర్వాత 2016లో అధ్యక్ష స్థానాన్ని అధిరోహించిన నవీన్ అనేక కార్యక్రమాలు నిర్వహించారు. సొంత నిధులతో పాటు దాతల సహకారాన్ని కూడా తీసుకున్నారు.

### సేవల్లో " అంతర్జాతీయ " స్థాయి గుర్తింపు ..

వాసవి క్లబ్ పగ్గాలు చేపట్టిన నవీన్ కుమార్ రికార్డ్ స్థాయిలో కార్యక్రమాలు నిర్వహించారు. ఒకే ఏడాదిలో 567 సేవా కార్యక్రమాలు చేపట్టి అంతర్జాతీయ స్థాయిలో సిద్ధిపేట క్లబ్ కు గుర్తింపు తెచ్చారు. సేవల్లో రికార్డ్ నెలకొల్పిన నవీన్ కుమార్ కు అంతర్జాతీయ స్థాయిలో ఉత్తమ సేవా పురస్కారం దక్కింది. ఈయన రికార్డ్ ను ఇప్పటి వరకు ఎవరూ చేరుకోలేదు.

### ఉత్తమ సేవలకు దక్కిన " నంది " పురస్కారం..

వాసవి క్లబ్ , అమర్ నాథ్ అన్నదాన సేవా సమితి , కేదారినాథ్ అన్నదాన సేవా సమితి తదితర సంస్థల ద్వారా సామాజిక కార్యక్రమాలను నిర్వహిస్తున్న మాంకాల నవీన్ కుమార్ ను నంది అవార్డు వరించింది. మంజునాథ ఫౌండేషన్ వారు రాష్ట్ర స్థాయిలో వివిధ స్వచ్ఛంద సంస్థల ద్వారా సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్న వ్యక్తులను గుర్తించి ప్రతి ఏటా బంగారు నంది పురస్కార బంగారు నంది పురస్కారాలను అందిస్తోంది. ఈ క్రమములోనే 2023 సంవత్సరానికి గాను సిద్ధిపేటకు చెందిన నవీన్ కుమార్ ను ఎంపిక చేసింది. 2023 ఫిబ్రవరి 8న హైదారాబాద్ రవీంద్ర భారతిలో నవీన్ కుమార్ నంది అవార్డును అందుకున్నారు.

### " డాక్టరేట్ " తో సత్కరించిన మనం ఫౌండేషన్

కరోనా సమయంలో నవీన్ కుమార్ ఆనేక మందికి నిత్యావసర వస్తువులను పంపిణీ చేశారు. మరి కొందరికి ఆర్థిక సహాయం అందించారు. పేద విద్యార్థులకు ఉచితంగా నోట్ బుక్కులు అందించారు. ఇంటర్ చదువుతున్న ఓ విద్యార్థినికి ఆర్థిక సహాయం చేసి ఆ అమ్మాయి చదువుకు ఆసరాగా నిలిచారు. సిద్ధిపేటలోని మానసిక వికలాంగుల కేంద్రంలో ఫర్నీచర్ , నిత్యావసరాలను అందించి దాతృత్వం చాటుకున్నారు. రక్తదాన శిబిరాల ద్వారా పలువురికి ప్రాణ దానం చేశారు. ఇలాంటి సేవలకు గుర్తింపుగా మహాత్మా గాంధీ జాతీయ శాంతి సేవారత్న సంస్థ వారు 2023 ఏప్రిల్ 10న నవీన్ కుమార్ కు డాక్టరేట్ ను ప్రధానం చేసింది.

### బాధ్యత పెంచిన " లైఫ్ టైమ్ అచీవ్ మెంట్ " అవార్డ్

వాసవి క్లబ్ ద్వారా ఎంతో మందికి ఇతోధిక సేవలు అందిస్తున్న నవీన్ కుమార్ కు హైదారాబాద్ కు చెందిన రితిక ఫౌండేషన్ వారు గత ఏడాది ఆగస్ట్ 13న ఏపీజే అబ్దుల్ కలాం పేరిట లైఫ్ టైమ్ అచీవ్ మెంట్ అవార్డును అందించారు. ఈ అవార్డ్ తో తన బాధ్యత మరింత పెరిగుండంటారు నవీన్ కుమార్. వాసవి క్లబ్ లో అంచెలంచెలుగా ఎదుగుతూ వివిధ హెూదాల్లో ఆయన సేవలందిస్తున్నారు. దాతల సహకారంతో 110 మంది పేద వధువులకు పుస్తె మట్టేలను అందించారు. నూతన వధూవరులకు బట్టలు , నిత్యావసర సరకులు పంపిణీ చేశారు. సేవా కార్యక్రమాలను విస్తృత పరుస్తూ పలువురికి స్ఫూర్తిగా నిలిచారు.

### ఆధ్యాత్మిక కార్యక్రమాల్లోనూ ముందే ..

ఆధ్యాత్మిక , ధార్మిక కార్యక్రమాల నిర్వహణలోనూ డాక్టర్ నవీన్ కుమార్ ముందు వరసలో నిలుస్తారు. సిద్ధిపేటలోని పాత వేంకటేశ్వర ఆలయంలో సభ్యునిగా , అధ్యక్షునిగా పనిచేసిన ఆయన పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలు చేపట్టారు. దాతల సహకారంతో పాటు సొంతంగా నిధులు వెచ్చించి ఆలయ అభివృద్ధికి కృషి చేశారు. బీఆర్ఎస్ పార్టీలో క్రియాశీలకంగా వ్యవహరిస్తున్న నవీన్ 2022 నుంచి 2024 వరకు శ్రీ సంతోషి మాతా ఆలయ ఛైర్మెన్ గా రెండు పర్యాలు పనిచేశారు. ఈ సమయంలో అమ్మవారికి వెండి మకర తోరణం , వెండి ద్వారం , ఉత్సవ విగ్రహానికి మకరతోరణం చేయించారు. వివిధ కార్యక్రమాలను నిర్వహించి వాటిలో స్థానికులను భాగస్వాములను చేశారు. అమర్ నాథ్ , కేదారి నాథ్ అన్నదాన సేవా సమితి ద్వారా దేశం నలుమూల నుంచి వచ్చే భక్తులకు ఉచితంగా అన్నవితరణ చేయడంలో తన వంతుగా సహకారం అందించారు.



వాసవి క్లబ్ సమావేశంలో

- నవీన్ కుమార్ చేపట్టిన పదవులు ..
- 2015 లో సిద్ధిపేట వాసవి క్లబ్ ప్రధాన కార్యదర్శి
- 2016 లో వాసవి క్లబ్ అధ్యక్షుడు
- 2017 లో వాసవి క్లబ్ జోన్ ఛైర్మెన్
- 2018 లో వాసవి క్లబ్ రీజియన్ ఛైర్మెన్
- 2019 నుంచి అమర్ నాథ్ అన్నదాన సేవా సమితి పీఆర్ఓగా వ్యవహరిస్తున్నారు.
- కేదారి నాథ్ అన్నదాన సేవా సమితి పీఆర్ఓ
- పాత వేంకటేశ్వర ఆలయం కార్యవర్గ సభ్యులు
- • 2022 – 2024 సంతిషి మాత ఆలయం ఛైర్మెన్
- సిద్దిపేట జిల్లా ఆర్యవైశ్య సేవాదళ్ విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్
- అలియన్స్ క్లబ్ సభ్యునిగా
- సిద్ధిపేట ప్యాడీ బ్రోకర్స్ అసోసీయేషన్ ప్రధాన కార్యదర్శి
- శ్రీ రావిచెట్టు హన్మాన్ ఛారిటబుల్ ట్రస్ట్ కార్యవర్గ సభ్యులు
- సిద్ధిపేట ఛాంబర్ ఆఫ్ కామర్స్ కో కన్వీనర్
- సిద్ధిపేట మండలం తడ్కపల్లి ఆవాస విద్యాలయం ప్రబంధ కారిణిగా

2025 సంవత్సరానికి గాను వాసవి క్లబ్ ఇంటర్ నేషనల్ జిల్లా %ం – 105గూ% రెండవ వైస్ గవర్నర్ గా 2024 నవంబర్ 9న నియామకం

### మానవ సేవే పరమావధి – డాక్టర్ నవీన్ కుమార్

సేవ చేయాలన్న ఆలోచన చాలా మందికి ఉంటుంది. కానీ ఆ అవకాశాన్ని భగవంతుడు కొందరికే ఇస్తాడు. సేవ చేసే భాగ్యాన్ని భగవంతుడు నాకు ఇచ్చినందుకు చాలా సంతోషంగా ఉంది. సమాజంలో పూట గడవని అభాగ్యులు ఎంతో మంది ఉన్నారు. అలాంటి వారిలో కొందరికైనా మంచి మేలు చేయాలన్నదే నా ఆశయం. అందుకే మానవ సేవే మాధవ సేవ అన్న సూక్తిని బాగా నమ్ముతాను. నా వ్యాపారంలో వచ్చే ఆదాయంలో కొంత భాగాన్ని సేవా కార్యక్రమాలకు వినియోగిస్తున్నాను. చాలా మంది దాతలు సహకారం అందిస్తున్నారు. ఎవరికి తోచిన రీతిలో వారు సేవా కార్యక్రమాలను విస్తృత పరిస్తే బాగుంటుంది.










# సంగారెడ్డి జిల్లాలో ఘనంగా బాలల దినోత్సవం


**సంగారెడ్డి అర్బన్ నవంబర్ 14:** సంగారెడ్డి జిల్లాలో నీ ఆయుధ కర్మగారం అంకుర్ విద్యాలయం మరియు వివిధ పాఠశాలల్లో గురువారం బాలల దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. పాఠశాల ప్రధానోపాధ్యాయుని ఘనంగా పిల్లలు సత్కరించారు అదేవిధంగా పాఠశాలలోని చిన్నారులకు గేమ్స్, డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. విద్యార్థులు దేశభక్తి గీతాలు ఆలపించారు. ఈ సందర్భంగా హెచ్ఎం మాట్లాడుతూ భారత తొలి ప్రధాని జవహర్లాల్ నెహ్రూ జన్మదినం పురస్కరించుకొని ప్రతి ఏటా నవంబర్ 14న బాలల దినోత్సవం జరుపుకుంటామని గుర్తు చేశారు. అనంతరం విజేతలైన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పేరెంట్ కమిటీ సభ్యులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.














## జనవాడ గ్రామ మహిళా అదృశ్యం కేసు నమోదు

**శంకర్పల్లి నవంబర్ 14:(డైలీ రిపోర్ట్):** ఇంట్లో ఉన్న మహిళా కనబడకుండా పోయిన ఘటన మోకిలా పిఎస్ పరిధిలో చోటుచేసుకుంది సిఐ వీరబాబు గౌడ్ తెలిపిన వివరాలు జన్వాడ గ్రామానికి చెందిన బ్యాగరి శంకరయ్య ఈ నెల 12వ తేదీ పని నిమిత్తం ఇంట్లో నుంచి బయటకు వెళ్లారు సాయంత్రం ఇంటికి వచ్చేసరికి తన కూతురు లావణ్య (35) కనిపించకుండా పోయింది చుట్టుపక్కల వెతికిన ఫలితం లేక గురువారం పీఎస్ లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు.

## శిశుమందిర్ పాఠశాల లో బాలల దినోత్సవం మరియు కార్తీక దీపారాధన



**ఆదిలాబాద్ జిల్లా డైలీ రిపోర్ట్ బ్యూరో :** ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడ శ్రీ సరస్వతీ శిశు మందిర్ పాఠశాల లో బాలల దినోత్సవాన్ని పురస్కరించుకొని విద్యార్థులకు డ్రాయింగ్ కాంపిటీషన్స్,సింగింగ్, డాన్సింగ్ పోటీలు నిర్వహించారు.గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. అనంతరం కార్తీక దీపారాధన కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులచే దీపాలు వెలిగించి తులసి చెట్టుకి పూజలు చేశారు.ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా మిట్టపల్లి నాగమణి గారు విచ్చేసి విద్యార్థులకు మార్గ దర్శనం చేశారు.ప్రధానాచార్యులు మరాఠీ సంతోష్ కుమార్, ఆచార్యులు ఉషారాణి,గాయత్రి,విజయ భారతి పాల్గొన్నారు.

## సర్కారు ఆసుపత్రి.. ప్రైవేటు మందు!

హైదరాబాద్: ప్రభుత్వ పెద్దాసుపత్రుల్లో ప్రైవేట్ మందుల మాఫియా రాజ్యమేలుతోంది. పేద రోగులను పీల్చిపిప్పి చేస్తోంది. ఆసుపత్రిలోని ఉచిత ఫార్మసీలో లేని మందును, ఈ ప్రైవేట్ మెడికల్ షాపుల యజమానులు తెప్పిస్తారు. ఏ మందులు తెప్పించాలో డాక్టర్లు వీరికి చెప్తారు. అదే మందును స్టాక్ పెట్టి రోగులకు అమ్ముతారు. అందులో డాక్టర్ కమీషన్ కనీసం 10 నుంచి 20 శాతం ఉంటుందని అంటున్నారు. హైదరాబాద్‌లోని ప్రముఖ ఆసుపత్రులైన గాంధీ, ఉస్మానియా, పేట్ల బురుజు, అలాగే వరంగల్‌లోని ఎంజీఎం, కరీంనగర్‌లోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రుల్లో ప్రైవేట్ మందుల షాపులు ఏటా రూ.కోట్లలో వ్యాపారం చేస్తున్నాయి. ఉచిత మందులు ఇవ్వాల్సిన పెద్దాసుపత్రుల్లో బహిరంగంగా ప్రైవేట్ మందుల మాఫియా దోపిడీ కొనసాగుతున్నా, దాన్ని అడ్డుకునే నాథుడే లేకుండా పోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వాటికి అడ్డుకట్ట వేయడంలో యంత్రాంగం విఫలమవుతోంది.

**మందుల దుకాణాలెందుకు?**

రాష్ట్రంలో కీలకమైన ఈ ఆసుపత్రుల్లో సాధారణ జ్వరం మొదలు... అత్యంత కీలకమైన అవయవ మార్పిడి చికిత్సల వరకు జరుగుతుంటాయి. వీటిల్లో పేదలకు ఉచిత వైద్యం, ఉచిత మందులు ఇవ్వాలనేది లక్ష్యం. అయినా అక్కడ ఉచిత మందుల దుకాణాలున్నా, ప్రైవేట్ మందుల దుకాణాలు ఎందుకు పెట్టారన్నది అంతుబట్టని ప్రశ్న. గాంధీ ఆసుపత్రిలో ఓపీ బ్లాక్‌కు సరిగ్గా ఎదురుగా వరుసగా నాలుగు ప్రైవేట్ మెడికల్ షాపులున్నాయి. ఉస్మానియా ఆసుపత్రిలో ఐదు, నిలోఫర్‌లో రెండు, పేట్లబుర్జు మెటర్నిటీ ఆసుపత్రిలో ఒకటి, కరీంనగర్ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో రెండు ప్రైవేట్ మందుల దుకాణాలు ఉన్నాయి. హైదరాబాద్‌లోని ఎంఎన్‌జే కేన్సర్ ఆసుపత్రి ప్రాంగణంలో ప్రైవేట్ మందుల దుకాణాలు ఉండవు.. కానీ దానికి అత్యంత సమీపంలోని మూడు మెడికల్ షాపులు కేన్సర్ మందులను అందుబాటులో ఉంచుతాయి. కొందరు ఆంకాలజిస్టులకైతే నెలకు ఐదారు లక్షల రూపాయల వరకు ఆ దుకాణాల నుంచి కమీషన్ తీసుకుంటున్నారన్న ప్రచారం ఉంది. కొన్ని ఫ్రీగా... కొన్ని కొనుగోలు చేసేలా ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రైవేట్ మెడికల్ దుకాణాలకు డాక్టర్లు, సూపరింటెండెంట్లు, రాష్ట్రస్థాయిలో కీలకమైన అధికారుల అండదండలు పుష్కలంగా ఉంటాయి. వారి అండతోనే ప్రైవేట్ మందుల దుకాణాదారులు రెచ్చిపోతుంటారు. రోగికి వైద్యుడు నాలుగు రకాల మందులు రాస్తే, అందులో ప్రభుత్వ దుకాణంలో రెండే ఉంటాయి. మిగిలిన రెండింటిని ప్రైవేట్ దుకాణంలో కొనాల్సిందే. ఒక్కోసారి మందులున్నా కూడా లేవని ప్రభుత్వ ఫార్మసీ వారు చెబుతారు. అప్పుడు ప్రైవేట్లో కొనాల్సిందే. ఇక ఎంఎన్‌జే కేన్సర్ ఆసుపత్రిలో రోగులకు ఇచ్చే మందులన్నీ దాదాపు బేసిక్‌వే. అడ్వాన్స్ ట్రీట్‌మెంట్‌కు అవసరమైన మందులు ఇవ్వాలంటే ఎంఎన్‌జే ఆసుపత్రిలో దొరకవు. పైగా అవి అత్యంత ఖరీదైనవిగా ఉంటాయి. కొన్ని డోసులైతే రూ.లక్షల్లో ఉంటాయి. సీఎంఆర్ఎఫ్ కింద బిల్లులు పెట్టి ప్రైవేట్ దుకాణాల్లో కొని వాడుతుంటారు. ఎంఎన్‌జే మినహా మిగిలిన ప్రభుత్వ ఆసుపత్రులకు ఇచ్చే మందులను తెలంగాణ వైద్య సేవలు, మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ (టీజీఎంఎస్ఐడీసీ) సరఫరా చేస్తుంది. అయితే చాలామందులు అత్యాధునికమైనవి కాకుండా బేసిక్ మందులనే సరఫరా చేస్తుందన్న ఆరోపణలున్నాయి.

Printed And Published By Bakka Ravinder,on Behalf of Daily Report Publications And broadcasting News, Sangareddy Municipality, Ganesh Nagar HNo 3-11/ Sangareddy District Telangana state , Editor. B. shirisha print code TELTEL.2019/082422 , Cell 8501919707